క్లుప్తంగా

దేశ భక్తి కలిగి ఉండాలి



వీర జవాను సురేంద్ర తండ్రిని సన్మానిస్తున్న సర్పంచు, ఎంపీడీఓ

పాములపాడు: ప్రతి ఒక్కరూ దేశం పట్ల భక్తి భావం కలిగి ఉండాలని సర్పంచు మేకల భాగ్యమ్మ, ఎంపీడీఓ గోపీకృష్ణ అన్నారు. శనివారం స్థానిక గ్రామ సచివాలయం వద్ద నా భూమి - నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన శిలా ఫలకం వద్ద అమర వీరులకు నివాళులర్పించారు. ఇటీవల ఉగ్రవాదుల చేతిలో వీర మరణం పొందిన శిరిగిరి సురేంద్ర తండ్రి సుబ్బయ్యను దుశ్శాలువా, పూలమాలతో సత్కరించారు. అనంతరం మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఏఈ నమేష్‌నాయుడు, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, టీఏ ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 విజేతకు సన్మానం



బాలగోవిందును సన్మానించిన ఫిజిక్స్ టీచర్ రమణరావు, క్రీడాశ్రీ పీతాంబరరెడ్డి

పగిడ్యాల: ఇటీవల వెలువడిన గ్రూప్-1 ఫలితాలలో విజయం సాధించి అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్‌గా ఎంపికైన బాలగోవిందును స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఫిజిక్స్ టీచర్ రమణరావు, క్రీడాశ్రీ పీతాంబరరెడ్డి శనివారం శాలువా కప్పి సన్మానించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి అయిన బాలగోవిందు గ్రూప్ -1 ఆఫీసర్‌గా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు చదివిన ఆయన గ్రూప్-1కు ఎంపికై పగిడ్యాల మండలానికే వన్నె తెచ్చారని తెలిపారు. భవిష్యత్‌లో మరెన్నో ఉన్నత పదవులను అలంకరించాలని ఆకాంక్షించారు.

సహకార సొసైటీ మాజీ చైర్మన్ మృతి



పుల్యాల సత్యంరెడ్డి(ఫైల్)

పగిడ్యాల: స్థానిక సహకార సొసైటీ మాజీ చైర్మన్ పుల్యాల సత్యంరెడ్డి(62) శనివారం మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో మంచం పట్టిన ఆయన కోలుకోలేక మధ్యాహ్నం కన్నుమూశారు. జెడ్పీటీసీ పుల్యాల దివ్య, వైస్ ఎంపీపీ పల్లె అరుణమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి, పల్లె సత్యనారాయణరెడ్డి, వై. చంద్రమౌళి తదితరులు నివాళులర్పించారు.

పాఠశాలకు వాటర్ ప్యూరిఫయర్ విరాళం



వాటర్ కూలర్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్

వెలుగోడు: పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలకు నంద్యాలకు చెందిన చైతన్య కళాభారతి స్వచ్ఛంద సంస్థ .. ఆశ చారిటీ (యూకే) సహకారంతో రూ.1.20 లక్షల విలువైన వాటర్ ప్యూరిఫయర్‌ను విరాళంగా ఇచ్చారు. శనివారం దీనిని సంస్థ చైర్మన్ వి.భాస్కర్ వెలుగోడు సర్పంచ్ వేల్పుల జయపాల్ ప్రారంభించారు. కార్యక్రమంలో గుంతకందాల సర్పంచ్ అచ్చమ్మ, స్పెషల్ ఆఫీసర్ శ్రీనిజ తదితరులు పాల్గొన్నారు.

రూరల్ సీఐగా విజయభాస్కర్



నందికొట్కూరు: రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విజయభాస్కర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన పట్టణ సీఐగా పని చేస్తూ రూరల్‌కు బదిలీ అయ్యారు. ఆయన మాట్లాడుతూ ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా పోలీసు స్టేషన్ ప్రజలు ఆశ్రయించాలని కోరారు.

క్షయవ్యాధి వైద్య శిబిరం



ఎక్స్‌రే క్యాంప్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో శనివారం ఉచిత క్షయవ్యాధి శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఎడతెరపి లేని దగ్గు, జ్వరం వచ్చినప్పుడు ప్రభుత్వ వైద్యశాలల్లో గళ్ల పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. మందులతోపూర్తిగా క్షయవ్యాధిని నిర్మూలించవచ్చన్నారు. అనంతరం క్షయవ్యాధి గ్రస్తులకు ఉచితంగా ఎక్స్‌రే తీసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ రవికుమార్, సౌజన్య, సత్యం, ఎల్లయ్య, శివశంకర్ పాల్గొన్నారు.



పైపాలంలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు బాలసుబ్బన్నకు డిక్లరేషన్ ఫాం అందజేస్తున్న అధికారి



డిక్లరేషన్ ఫాం అందుకుంటున్న తర్తూరు2వ వార్డు స్థానానికి గెలుపొందిన బోయనాగేంద్ర



పగిడ్యాలలో గుండెపోగు సాంబకు డిక్లరేషన్ పత్రం అందజేస్తున్న రిటర్నింగ్ ఆఫీసర్ సుభాన్



తర్తూరులో ఓటువేయడానికి క్యూలో నిల్చొన్న మహిళా ఓటర్లు



కొత్తపల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ నాగభూషణం

వార్డు ఉప ఎన్నికలు ప్రశాంతం

- సమస్యాత్మక ప్రాంతాల్లో భారీ బందోబస్తు నడుమ పోలింగ్
- అత్యధిక స్థానాల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులదే గెలుపు
- ఒక్క స్థానంతో సరిపెట్టుకున్న టీడీపీ



పగిడ్యాలలో ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళలు, పురుషులు



పగిడ్యాలలో వృద్ధురాలిని ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి తీసుకొస్తున్న మహిళలు



పైపాలెంలో సహాయకురాలితో ఓటు వేసేందుకు వెళ్తున్న వృద్ధురాలు

మిడుతూరు: నియోజకవర్గ వ్యాప్తంగా ఖాళీగా ఉన్న వార్డు స్థానాలకు శనివారం ఉప ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని పైపాలం ఐదవ వార్డు , అలగనూరులో పదో వార్డుకు ఉప ఎన్నిక నిర్వహించారు. రెండు గ్రామాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసినట్లు ఎంపీడీఓ జీఎస్ఎస్‌రెడ్డి తెలిపారు. పైపాలంలో 5వ వార్డుకు సంబంధించి వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడైన బాలసుబ్బన్న, టీడీపీ మద్దత్తుదారురాలైన లక్ష్మీదేవిపై 8 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మొత్తం 78 ఓట్లకు గాను మొత్తం పోల్‌కాగా బాలసుబ్బన్నకు 43 ఓట్లు, లక్ష్మీదేవికి 35 ఓట్లు వచ్చాయి. దీంతో బాలసుబ్బన్న గెలుపొందినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సురేష్ కుమార్ ప్రకటించి డిక్లరేషన్ ఫాం అందజేశారు. అలగనూరు 10వ వార్డుకు సంబంధించి మొత్తం 103 ఓట్లు ఉండగా 99 ఓట్లు పోలయ్యాయి. మూడు ఇన్‌వాలీడ్ ఓట్లు కాగా పోలైన ఓట్లలో టీడీపీ మద్దతుదారుడైన పాలగళ్ల శేషమ్మకు 78 ఓట్లు రాగా, వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడైన సుధాకర్‌కు 21 ఓట్లు మాత్రమే దక్కాయి. 57 ఓట్ల మెజార్టీతో విజయం సాధించిన శేషమ్మకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఫక్రుద్దీన్ డిక్లరేషన్ ఫాం అందజేసి విజేతగా ప్రకటించారు.

తర్తూరులో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుని గెలుపు

జూపాడుబంగ్లా: తర్తూరు గ్రామపంచాయతీలోని 2వ వార్డుకు శనివారం జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు దారుడైన బోయ నాగేంద్ర ప్రత్యర్థి అభ్యర్థిపై 20ఓట్ల మెజార్టీతో గెలుపొందినట్లు పోలింగ్ అధికారులు చంద్రశేఖర్, శాంతయ్య తెలిపారు. వార్డులో 168 మంది ఓటర్లు ఉండగా అందులో 82 మంది స్త్రీలు, 86 మంది పురుషులున్నారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ ప్ర క్రియ మధ్యాహ్నం ఒంటిగంటకు పోలింగ్ ముగిసే సమయానికి 146 ఓట్లు పోలయ్యాయి. అందులో స్త్రీలు 74, పురుషులు 72 ఓటు వేశారు. మధ్యాహ్నం 2 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కాగా రెండు ఓట్లు చెల్లనివి రాగా, బోయ నాగేంద్రకు 82 ఓట్లు, షేక్‌నూరుల్లా కు 62 ఓట్లు లభించాయి. 20ఓట్ల మెజార్టీతో బోయ నాగేంద్ర ప్రత్యర్థి అభ్యర్థి షేక్ నూ రుల్లాపై విజయం సాధించాడు.నాగేంద్రకు ఎన్నికల అధికారులు చంద్రశేఖర్, శాంతయ్య డిక్లరేషన్ ఫారాన్ని అందజేశారు.ఎలాంటి అ వాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ వెంకటసుబ్బయ్య తనసిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

భారీ బందోబస్తు నడుమ ఉప ఎన్నిక

కొత్తపల్లి: మండల కేంద్రమైన కొత్తపల్లి 10వ వార్డుకు జరిగిన ఉప ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలోని 10 బూత్‌లో ఎన్నికల రిటర్నింగ్ స్టేజ్ - 2 అధికారి పెద్దన్న ఆధ్వర్యంలో 20 మంది పోలీసు సిబ్బంది బందోబస్తు నడుమ ఉప ఎన్నిక హోరాహోరీగా జరిగింది. ఈ వార్డులో 265 ఓట్లు ఉండగా 197 మంది ఓటర్లు వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో గోద శివమ్మకు 93 ఓట్లు పడగా, తప్పెట నాగమ్మకు (ఇండిపెండెంట్) 100 ఓట్లు పడ్డాయి. దీంతో నాగమ్మ 7 ఓట్ల మెజార్టీతో గెలుపొందింది. 4 ఓట్లు చెల్లనివిగా అధికారులు నిర్ధారించారు. ఎన్నికల సరళిని ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ నాభూషణంలు ఎస్ఐ హుస్సేన్‌బాషాతో కలసి పరిశీలించారు.

పగిడ్యాలలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడి విజయం

పగిడ్యాల: స్థానిక గ్రామ పంచాయతీ 9వ వార్డు సభ్యుడి ఉప ఎన్నికకు శనివారం జరిగిన పోలింగ్‌లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడైన గుండెపోగు సాంబ 64 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. వార్డులో 545 మంది ఓటర్లు ఉండగా 390 ఓట్లు పోలయ్యాయి. ఇందులో పురుషులు 196 మంది, మహిళలు 194 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 71.5 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుభాన్ వెల్లడించారు. 2 గంటల నుంచి ప్రారంభమైన ఓట్ల లెక్కింపులో వైఎస్సార్‌సీపీ మద్దతు దారు గుండెపోగు సాంబకు 220 ఓట్లు వచ్చాయి. అలాగే టీడీపీ మద్దతుతో పోటీ చేసిన మీనుగ బాబుకు 156 ఓట్లు, ఒక ఓటు నోటాకు, 13 ఓట్లు చెల్లనివిగా నమోదైనట్లు ఆర్వో వెల్లడించారు. 9వ వార్డు సభ్యుడిగా ఎన్నికైన సాంబకు రిటర్నింగ్ అధికారి డిక్లరేషన్ ఫాం అందజేశారు. పోలింగ్ సరళిని మండల డిప్యూటీ తహసీల్దార్ మురళీ పరిశీలించారు. పోలింగ్ స్టేషన్ పరిసరాలలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముచ్చుమర్రి ఎస్ఐ నాగార్జున, ఆత్మకూరు ఎస్ఐ వెంకట నారాయణరెడ్డి, ఏఎస్ఐ కృష్ణుడు బందోబస్తు చర్యలు చేపట్టారు.



నాగటూరులో గెలుపొందిన అభ్యర్థి వుశేనయ్యకు డిక్లరేషన్ ఫారం ఇస్తున్న ఎన్నికల అధికారులు

నాగుటూరులో 53 ఓట్ల మెజారిటీ

నందికొట్కూరు రూరల్ : నందికొట్కూరు మండల పరిధిలోని నాగటూరు గ్రామంలోని 8వ వార్డు సభ్యుడి స్థానానికి శనివారం ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు సగినేల వుశేనయ్య 53 ఓట్లతో గెలుపొందినట్లు ఎన్నికల అధికారి షేక్షావలి తెలిపారు. మొత్తం 191 ఓట్లు పోలవ్వగా వాటిలో సగినేల వుశేనయ్యకు 122 ఓట్లు చెరుకు రత్నమ్మకు 69 ఓట్లు వచ్చినట్లు వెల్లడించారు. అనంతరం గెలుపొందిన అభ్యర్థికి అధికారులు డిక్లరేషన్ ఫారం అందజేశారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం

నందికొట్కూరు: పట్టణంలోని ముబారక్ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలో పురవీధుల వెంట ర్యాలీ చేపట్టారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కెమెరాను లూయీస్ డాగురే కనిపెట్టారన్నారు. ఫొటోతో జ్ఞాపకాలు పదిలంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఫోటో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్, కౌన్సిలరు చిన్నరాజు, వైఎస్సార్‌సీపీ మైనార్టీ జోనల్ ఇన్‌చార్జ్ అబుబక్కర్, నాయకులు ఉస్మాన్‌బేగ్, జబ్బార్, జువ్వాజి సుంకన్న గౌడ్ సేవా సమితి అధ్యక్షులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణంలో శనివారం ప్రపంచ ఫొటో గ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆత్మకూరు ఫొటోగ్రాఫర్స్ యూనియన్ ప్రెసిడెంట్ శివగౌడ్, ఉపాధ్యక్షులు అన్వర్‌అలీ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ పితామహుడు లూయి డాగురే చిత్రపటానికి పూలమాల వేసి, కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మధు, చంద్రశేఖర్, ఇస్మాయిల్, ధర్మ, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి

పత్తిలో రసం పీల్చే పురుగులను నివారించాలి

నందికొట్కూరు రూరల్ : పత్తి పంటలో మొక్క ప్రారంభదశలో ఆశించే రసం పీల్చే పురుగులను గుర్తించి తక్షణమే నివారించాలని జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్తలు సరలమ్మ, రామక్రిష్ణ రావ్ సూచించారు. శనివారం మండల పరిధిలోని దామగట్లలో వారు రైతులు సాగు చేసిన పత్తి పంటలను పరిశీలించి, రసం పీల్చే పురుగులను గుర్తించారు. వారు మాట్లాడుతూ వాతావరణ పరిస్థితుల ఆధారంగా పత్తిపంటలో రసం పీల్చే పురుగులైన తెల్లదోమ, తామర పురుగు, పేనుబంక, పచ్చ దోమల తాకిడికి మొక్క ఆకులు ముడుచుకుని, ఎండిపోయి రాలిపోవడం జరుగుతుందన్నారు. వీటి నివారణకు రైతులు ఇమిడాక్లోపిడ్ లీటరు నీటికి 0.4మి.లీ, అసెటిమిప్రిడ్ 1గ్రాము లీటర్ నీటితో కలిపి మొక్కలకు పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌సీ వ్యవసాయాధికారి ప్రభావతమ్మ, వీఏఏలు దాసు, హేమలత, మౌనిక పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

నీటిని పొదుపుగా వాడుకోవాలి

మహానంది: వర్షాభావ పరిస్థితులు, ఎగువ నుంచి నీరు విడుదల తక్కువగా ఉన్నందున రైతులు ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవాలని తెలుగుంగ ఎస్ఈ వెంకటరమణయ్య తెలిపారు. వెలుగోడు నుంచి మహానంది వరకు తెలుగుగంగ కాల్వ వెంట జరుగుతున్న పనులు, నీటి ప్రవాహాన్ని శనివారం పరిశీలించారు. ప్రస్తుతం సాగు చేసుకుంటున్న పంటలు దెబ్బతినకూడదన్న ఉద్దేశంతో రెండు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారన్నారు.

బాల్యవివాహాలను ప్రోత్సహిస్తే చర్యలు

మహానంది: బాల్యవివాహాలను ప్రోత్సహించేవారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటారని ఎంఈఓ రామసుబ్బయ్య తెలిపారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అబ్బీపురంలోని కస్తూర్బా పాఠశాలలో శనివారం బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సీడీపీఓ సూర్యకుమారి, కేజీబీవీ ప్రిన్సిపాల్ హర్షిత, వైస్ ప్రిన్సిపాల్ వసంతలక్ష్మి పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు

ఆత్మకూరు: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో శనివారం ఆత్మకూరు సబ్ డివిజన్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీలో చైర్మన్‌గా ఆర్డీఓ దాస్‌తో పాటు కమిటీ సభ్యుల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ప్రధాన సభ్యులుగా ఎనుమల రాజకుమార్, ఫక్రుద్దీన్ అలీ, మీరాసాహెబ్, సాదిక్, నవీన్‌లు ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులు చైర్మన్ దాస్‌ను సన్మానించారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

కొత్తపల్లి: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని సర్పంచు కలబండి మారెన్న అన్నారు. శనివారం గోకవరం గ్రామంలో సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ ప్రత్యేక చొరవతో గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో ఓసీ కాలనీ నుంచి బీసీ కాలనీ వరకు సీసీరోడ్డు నిర్మిస్తున్నామన్నారు. ఉపసర్పంచు లక్ష్మీనారాయణ, నాయకులు ఉస్సేన్‌రెడ్డి, తెలుగు మల్లయ్య, చెన్నయ్య, జెమ్స్, జయన్నలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూరు: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని బైర్లూటి వైద్యాధికారి పవన్‌కుమార్ సూచించారు. మండలంలోని చెంచుగూడెంలో శనివారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శివ, భాస్కర్ పాల్గొన్నారు.

పొలంబడితో అధిక దిగుబడులు

కొత్తపల్లి: పొలంబడి కార్యక్రమంతో రైతులు పంటల్లో అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయాధికారి కె.మహేష్ సూచించారు. శనివారం మండలంలోని నందికుంట గ్రామ పొలిమేరలోని పత్తి పంటపొలాల్లో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు.

ప్రభాస్‌ను కలిసేందుకు పాదయాత్ర

మహానంది: తమ్మడపల్లెకు చెందిన అయిజ రహీంకు సినీ హీరో ప్రభాస్ అంటే పిచ్చి. ప్రభాస్‌ను ఎలాగైనా కలవాలనుకున్న రహీం శనివారం స్వగ్రామం నుంచి హైదరాబాద్‌కు కాలినడకన బయల్దేరాడు. ప్రభాస్ అభిమానులు మార్గ మధ్యలో రహీంను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

'వైఎస్సార్ కళ్యాణమస్తు' పేదలకు వరం

మిడుతూరు: వైఎస్సార్ కళ్యాణమస్తు పథకం పేదలం వరం లాంటిదని నాగలూటి గ్రామ సర్పంచ్ ఉషారాణి అన్నారు. నాగలూటి గ్రామంలో కురువ సావిత్రికి వైఎస్సార్ కళ్యాణమస్తు పథకం కింద మంజూరైన రూ. 50 వేలను శనివారం సర్పంచ్‌తో పాటు పీరుసాహెబ పేట సహకార సొసైటీ చైర్మన్ నాగతులసిరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు నబిరసూల్, నాయకులు పెద్దపుల్లారెడ్డి, రాంభూపాల్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారుడికి రూ. 50 వేలు అందజేస్తున్న సర్పంచ్ ఉషారాణి , సహకార సొసైటీ చైర్మన్

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

- ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- వెంకటాపురంలో రెండవ రోజు 'గడప గడపకు మన ప్రభుత్వం'
- కార్యక్రమానికి విశేష స్పందన



మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో రెండవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మిరెడ్డి, కుందూరు నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి, ఎమ్మెల్యేకు గజమాలతో సత్కరించారు. మహిళలు పుష్పగుచ్ఛాలు అందించి హారతులతో ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల హృదయాలు దోచుకున్నాయని, ప్రతి లబ్ధిదారునికి రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించిందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు.

కులమతాలకు అతీతంగా పథకాలు

వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం వైఎస్ జగన్ మన ముందు ఉంచారని ఎమ్మెల్యే అన్నారు. కులం , మతం, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి అందజేస్తున్నామని తెలిపారు. గ్రామంలో పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు రెండు రోజులు నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్థానికుల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి, ఎంపీపీ తిరుపాలమ్మ, పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, లక్ష్మిరెడ్డి, విజయచౌదరి, సురేష్, సుల్తాన్, ఎంపీడీఓ మోహన్‌కుమార్, తహసీల్దార్ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహంలో సమస్యలు పరిష్కరిస్తాం

మండలంలోని వెంకటాపురం ఎస్సీ వసతి గృహాన్ని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి శనివారం పరిశీలించారు. పలు గదుల్లో బీటలుబారిన బండపరుపులు, మంచినీటి సమస్య తదితర వాటిని పరిశీలించారు. హాస్టల్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. వార్డెన్ అంకన్న, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా ప్రియదర్శిని

నందికొట్కూరు: ర్యాగింగ్ చట్టరీత్యా నేరమని సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా ప్రియదర్శిని అన్నారు. శనివారం పట్టణంలోని బసిరెడ్డి డిగ్రీ కళాశాలలో ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్జి మాట్లాడారు. చెడు అలవాట్లుకు స్వస్తి పలికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. విద్యలో రాణించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. అనంతరం కళాశాల యాజమాన్యం జడ్జిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సత్యనారాయణ, డైరెక్టర్స్ రమేష్‌రెడ్డి, సరళాదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కడుపునొప్పి తాళలేక..

మహానంది: బండిఆత్మకూరు మండలం కాకనూరు గ్రామానికి చెందిన బాలయేసు(48) ఆత్మహత్యకు పాల్పడగా కోలుకోలేక శనివారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన బాలయేసు కడుపు నొప్పి తాళలేక శుక్రవారం పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే కోలుకోలేక మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య సరోజ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

దుండగులపై చర్యలు తీసుకోవాలి

కొత్తపల్లి: బావులు, వ్యవసాయ మోటార్ల వద్ద విద్యుత్ వైర్లు దొంగలిస్తున్న దుండగులపై అధికారులు చర్యలు తీసుకోవాలని సింగరాజుపల్లె, బట్టువారిపల్లె గ్రామాల రైతులు నక్కజాన్, జేమీస్, యోహాను, నాగిరెడ్డి, మునిరంగ, రాజు, దేవకుమార్, ఉశేనయ్య కోరారు. శనివారం మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్ ఎదుట వారు విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు 8 మంది రైతులకు చెందిన బావులవద్ద, వ్యవసాయ మోటార్ల వద్ద విద్యుత్ తీగలను కత్తిరించి దొంగలించారన్నారు. ఈ విషయంపై కొత్తపల్లి ఎస్ఐ హుస్సేన్‌బాషాకు ఫిర్యాదు చేశామని తెలిపారు.

మార్కెట్‌యార్డు అభివృద్ధే ధ్యేయం

- చైర్‌పర్సన్ గా బాధ్యతలు చేపట్టిన రహత్

నందికొట్కూరు: మార్కెట్‌యార్డు అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తానని మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ షేక్ రహత్ అన్నారు. శనివారం పట్టణంలోని మార్కెట్ యార్డులో చైర్‌పర్సన్‌గా ఆమె బాధ్యతలు చేపట్టారు. మార్కెట్‌యార్డు సెక్రటరీ బీ.వీ. ఆర్ కృష్ణానాయక్ ఆమెకు బాధ్యతలు అప్పగించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు సంక్షేమానికి పెద్ద పీట వేశారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు రాయితీలు ఇస్తున్నారని గుర్తు చేశారు. సీఎం వైఎస్ జగనన్నకు, రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సీఎం వైఎస్ జగనన్న, వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి, బైరెడ్డి సిద్ధార్థరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు డైరెక్టర్లు జగదీశ్వరరెడ్డి, జలీల్, గఫార్, ఉస్మాన్, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ శివరామ కృష్ణారెడ్డి, ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు రవూఫ్, నాయబ్, వైఎస్సార్‌సీపీ నాయకులు అబుబక్కర్, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.



మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్‌గా బాధ్యతలు తీసుకుంటున్న షేక్ రహత్

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం శిఖరేశ్వరం సమీపంలో శనివారం మధ్యాహ్నం ఆటో అదుపుతప్పి రెయిలింగ్‌పై పడటంతో సున్నిపెంటకు చెందిన ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. సున్నిపెంట నుంచి మార్కాపురానికి ఒక కుటుంబం ఆటోలో వెళ్తుండగా ఆటో డ్రైవర్ అతివేగంగా నడపడంతో అదుపుతప్పి రెయింగ్‌పై పడింది. ఈ ప్రమాదంలో మార్కాపురానికి చెందిన ఏసు, దేవమ్మ, సుగుణమ్మ, టి.గాయత్రి, ఇమానియేలు గాయపడ్డారు. ఆటోలో ఉన్న మరో ఇద్దరికి ఎటువంటి గాయాలు కాలేదు. 108 సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు ప్రాథమిక వైద్యం అందించి శ్రీశైలం ప్రాజెక్ట్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పగిడ్యాల: జీవితంపై విరక్తి చెందిన లక్ష్మాపురం గ్రామానికి రామాంజినేయులు శనివారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇదిలా ఉండగా నెల రోజుల క్రితం జరిగిన బైక్ ప్రమాదం విషయంలో ముచ్చుమర్రి ఎస్ఐ తన కుమారుడిని తరచూ స్టేషన్‌కు పిలిచి వేధిస్తుండటంతోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని తల్లి లక్ష్మీదేవి వాపోయింది. ఈ విషయమై ఎస్ఐ నాగార్జునను వివరణ కోర గా లక్ష్మాపురం గ్రామస్తులు కుమ్మరి గోవిందు మరి కొందరూ అతనిని స్టేషన్‌కు తీసుకొచ్చారని, ఉప ఎన్నిక బందోబస్తులో బిజీబిజీ ఉండి గమనించలేదన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచకపోతే చర్యలు

కొత్తపల్లి: పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచకపోతే సిబ్బందిపై చర్యలు తప్పవని ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని శివపురం గూడెం ఆశ్రమ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా పాఠశాల పరిసరాలను, వసతిగృహ పరిసరాలను పరిశీలించి, విద్యార్థులకు ఏఏ సౌకర్యాలు ఉన్నాయని ఆరాతీశారు. పరిసరాలు శుభ్రంగా ఉంచకపోవడంపై పాఠశాల, వసతిగృహ సిబ్బందిపై మండిపడ్డారు. విద్యార్థులకు రాత్రిపూట పడుకునే సమయంలో దోమలు కుట్టకుండా దోమతెరలు వాడకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఏ విద్యార్థి అనారోగ్యానికి గురైనా సిబ్బందిని ఇంటికి పంపిస్తామని హెచ్చరించారు. వసతి గృహ సిబ్బందికి మెమోలు జారీ చేస్తామన్నారు. అనంతరం గిరిజన రైతులు సాగు చేసుకుంటున్న పండ్లతోటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్ట్ మేనేజర్ కే .జీ.నాయక్, ఐటీడీఏ ఏపీఓ రాజునాయక్ పాల్గొన్నారు.



వసతిగృహ వార్డెన్‌తో మాట్లాడుతున్న పీఓ